www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి
భద్రాద్రి
ఆదివారం | 01 | నవంబర్ | 2026
పేజీలు : 8

బ్యాంకు ఉద్యోగినిపై సహోద్యోగి కత్తితో దాడి

-అడ్డుకోవడంతో చేతి వేళ్లు, ముఖానికి గాయాలు
-పోలీసుల అదుపులో నిందితుడు
-వైరాలో కలకలం

ప్రజాపక్షం/వైరాः వైరాలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాహ్మణపల్లి శాఖలో మహిళా ఉద్యోగినిపై సహోద్యోతి కత్తితో దాడికి పాల్పడిన ఘటన శనివారం కలకలం రేపింది. పట్టపగలు బ్యాంకులోనే చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాహ్మణపల్లి శాఖలో పిల్లి ప్రదీప్, తేజశ్రీ ఫీల్డ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్న పిల్లి ప్రదీప్ తన సహోద్యోగి తేజశ్రీపై ఆకస్మాత్తుగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఆమె గొంతుపై కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించగా, తేజశ్రీ తన చేతిని అడ్డుకోవడంతో చేతి వేళ్లతో పాటు ముఖానికి గాయలయ్యాయి. వెంటనే స్పందించిన వారు గాయపడిన తేజశ్రీని బ్యాంకు సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా సహోద్యోగినిపై కత్తితో దాడికి పాల్పడిన పిల్లి ప్రదీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగినిపై తోటి ఉద్యోగి కత్తితో దాడికి పాల్పడటం వైరాలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

జిల్లాలో రాజకీయ రగడ

సామినేని హత్య నిందితుల అరెస్టు తర్వాత పరస్పర ఆరోపణలు

సుదీర్ఘ విచారణ.. అయినా అనుమానాలే

-సిపిఎం ఆధ్వర్యంలో 'భట్టి' దిష్టిబొమ్మల దగ్ధం
-కాంగ్రెస్ తీరుపై కార్యకర్తల్లో అసంతృప్తి
-జాప్యంతో ఏమి సాధించారన్న ప్రశ్న








ప్రజాపక్షం/ ఖమ్మం : ఏడాది నాడు సంచలనం సృష్టించిన సిపిఎం నేత సామినేని రామారావు హత్యకు సంబంధించి ఏడాదికి నిందితులను అరెస్టు చేసిన తర్వాత కూడా అదే రీతిలో రాజకీయ విమర్శలకు తావిస్తుంది. కాంగ్రెస్, సిపిఎం పార్టీలు పరస్పర విమర్శలతో జిల్లాతో పాటు రాష్ట్రంలోనూ రాజకీయ రగడ నడుస్తుంది. 31 అక్టోబర్ 2025న గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో సిపిఎం నేత సామినేని రామారావు స్వగ్రామం

మిగతా 2లో..

కార్మికులకు అండగా ఎఐటియుసి



ప్రజాపక్షం/పాల్వంచ : కారుచీకట్లో కాంతిరేఖ ఎర్రజెండా అని సమస్యల పరిష్కారం కోసం కార్మికులకు 106 సంవత్సరాల నుండి ఏఐటియుసి అండగా నిలబడి పోరాడుతున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏఐటియుసి 107వ, ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పాల్వంచ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పట్టణంలో కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్మిక అడ్డాలు, పలు సెంటర్లలో ఎర్రజెండాలను ఎగురవేశారు. పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటియుసి పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం ఆవిష్కరించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం 1920 అక్టోబర్ 31వ, తేదీన ముంబైలోని ఎంపైర్ థియేటర్‌లో ఏఐటియుసిని స్థాపించారని దీనికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, స్వాతంత్ర సమరయోధులు లాలా లజపతి రాయ్ వ్యవరించారని, అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ,

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని

సుభాస్ చంద్రబోస్, వివి.గిరి లాంటి జాతీయ నాయకులు సైతం అధ్యక్షులుగా కొనసాగినట్లు చెప్పారు. బ్రిటీష్ వలస పాలకుల వ్యతిరేకంగా నిలబడి కొట్లాడింది, స్వాతంత్ర సమరంలో, కార్మికుల హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలు దేశ చరిత్రలో ఓమైలురాయిగా నిలిచాయన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం శతాబ్దానికి పైగా సాగిన అలుపెరుగని పోరాటాలు, లెక్కలేనన్ని రక్త తర్పణలు, వీరోచిత త్యాగాల పునాదులపై నిర్మితమైన ఏఐటియుసి మాత్రమే కార్మిక లోకానికి కొండంత అండగా నిలుస్తుందన్నారు. దేశంలో అన్ని రంగాలకు చెందిన కార్మికులు అనుభవిస్తున్న హక్కులు ఏఐటియుసి పోరాట ఫలితమేనన్నారు. తెల్ల దొరల నిరంకుశ పాలన కాలం నుండి స్వాతంత్ర్యోద్యమం వరకు దేశ ప్రగతి చక్రాలను తిప్పిన కార్మికుల చెమట చుక్కలకు విలువనివ్వాల్సిన పాలకులు కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని మండి పడ్డారు. శ్రామికులు దశాబ్దాల పాటు

మిగతా 2లో..



జిల్లాలో రాజకీయ రగడ

(మొదటిపేజీ తరువాయి)

పాతర్లపాడు గ్రామంలో హత్యకు గురైన విషయం విధితమే. స్థానిక కాంగ్రెస్ నాయకులే హత్య చేశారని రామారావు సతీమణి ఐదుగురిపై ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి మొదలైన సిపిఎం, కాంగ్రెస్‌ల మధ్య ఆరోపణలు నిందితుల అరెస్టు తర్వాత కూడా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పోలీసులు అరెస్టు చేసిన బోడపట్ల శ్రీనివాసరావు, నూకల లింగయ్య, మందడపు లక్ష్మయ్య, కర్లపూడి ఉదయ్‌కుమార్ లు అమాయకులని వారికి ఈ హత్యతో ఎటువంటి సంబంధం లేదని సిపిఎం చెబుతుంది. అసలు దోషులను కాపాడేందుకు అమాయకులను కేసుల్లో ఇరికించారని ఇది మొత్తం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిపి సునీల్‌దత్‌తో కలిసి చేసిన కుట్రగా సిపిఎం అభివర్ణిస్తుంది. అసలు దోషులను కాపాడేందుకు భట్టివిక్రమార్క ప్రయత్నించారని రాజకీయంగా సిపిఎంను దెబ్బతీసేందుకే సామినేని రామారావును హతమార్చారని ఆరోపిస్తూ జిల్లా వ్యాప్తంగా భట్టి దిష్టిబొమ్మలను శుక్ర, శనివారాల్లో దగ్ధం చేశారు. వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

సుదీర్ఘ విచారణ.. అయినా అనుమానాలే

సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి జిల్లాలో ఏనాడు లేని విధంగా సుదీర్ఘ కాలం విచారణ జరిగింది. దాదాపు ఏడాది పాటు జరిగిన ఈ విచారణ తర్వాత నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అయినా ఈ హత్య కేసుకు సంబంధించి పలు ప్రశ్నలను దర్యాప్తు అధికారులు ఎదుర్కొనక తప్పడం లేదు. సాంకేతికంగా పలు పరీక్షలు నిర్వహించి పోలీస్ పద్ధతిలో విచారణ చేపట్టిన తర్వాత నిందితులను ప్రవేశపెట్టిన పోలీసులు మీడియాకు అసంపూర్తి సమాచారం ఇచ్చారు. వాస్తవానికి నిందితులకు, హతునికి మధ్య ఎటువంటి సంబంధం లేదు. పరిచయాలు కూడా ఉండి ఉండకపోవచ్చు. ఒక గ్రామం కాదు, సమీప గ్రామం కూడా కాదు. ప్రత్యర్థి రాజకీయ పార్టీ అంతకన్న కాదు. అయినా హత్య కేసులో నిందితునిగా చూపెట్టినప్పుడు ఎందుకు హత్య చేశారు, హత్యకు గల కారణాలు ఏమిటి, హత్య ఏవిధంగా చేశారు. అన్న ప్రాథమిక సమాచారాన్ని పోలీసులు తెలపాల్సి ఉంది. కేవలం ఈ నలుగురు వ్యక్తులు సామినేని రామారావును హత్య చేశారని చెబుతూ వివిధ సాంకేతిక పరీక్షలు సుదీర్ఘ విచారణ తర్వాత దోషులను తేల్చామని హత్యకు ఉపయోగించిన కత్తులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని మాత్రమే తెలిపారు. ఖమ్మం సిపి చట్టానికి లోబడి సమాచారం ఇచ్చి ఉండవచ్చు కానీ అది అసంపూర్తిగా ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. హత్యకు గల కారణాలు వివరించకపోవడం ఇది రాజకీయ రగడకు కారణమైంది.

కాంగ్రెస్ కార్యకర్తల్లో అసంతృప్తి :

సామినేని రామారావు హత్య జరిగిన నెల రోజుల తర్వాత నుండి కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ అధినాయకత్వంపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విమర్శలు చేస్తూనే ఉన్నారు. అధికారం చేతిలో ఉండి దర్యాప్తుకు సంబంధించి అన్ని కోణాల్లో త్వరితగతిన దర్యాప్తు చేయకుండా జాప్యం చేస్తున్నారన్న కాంగ్రెస్ కార్యకర్తల ప్రశ్నకు సమాధానం చెప్పలేని పరిస్థితి. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం కొందరితో మిలాఖత్ అయి అసలు దోషులను బయటకు రాకుండా కాంగ్రెస్ పార్టీయే అడ్డుపడిందన్న భావన కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉండటం గమనార్హం. చింతకాని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ హత్య కేసుతో మనకు ఎటువంటి సంబంధం లేనప్పుడు అసలు దోషులను పట్టుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఒక ఏడాది పాటు హత్య కేసుకు సంబంధించి తీవ్ర జాప్యాన్ని కొనసాగించిన అధికార కాంగ్రెస్ నిందితుల అరెస్టు తర్వాత మరింత ఆత్మరక్షణలో పడింది. పోలీసులు సరైన సమాచారం ఇవ్వకపోవడం, సిపిఎం విమర్శలను కాంగ్రెస్‌పార్టీ మౌనంగా చూస్తుండిపోవడం భట్టి వర్గీయులు తప్ప మరెవరు సిపిఎం ఆరోపణలను ఖండించే ప్రయత్నం చేయకపోవడం కాంగ్రెస్‌లోని అంతర్గత విబేధాలకు తావిచ్చినట్లయింది. రాష్ట్ర నాయకులతో పాటు ఖమ్మం జిల్లాలోని ఇతర ప్రాంతాల నాయకులు ఎవరు ఈ హత్యపై స్పందించడం లేదు. కార్యకర్తలు సైతం జాప్యానికి కారణమైన వారికి తగిన శాస్తి జరిగిందిలే అన్న భావనలోనే ఉన్నారని ఇప్పటికీ ఎవరినో కాపాడేందుకే కాంగ్రెస్ అధి నాయకత్వం ప్రయత్నిస్తుందన్న భావన ఒక స్థాయి నాయకుల్లో సైతం ఉండటం గమనార్హం. మొత్తానికి సిపిఎం నాయకుడు సామినేని రామారావు హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెట్టడంలో సిపిఎం కొంత మేర సఫలీకృతమైంది. పూర్తి విచారణ తర్వాత పోలీసులు సరైన కోణంలో విచారణ జరిపి పూర్తి వివరాలను వెల్లడిస్తే తప్ప లేకపోతే మధిర నియోజక వర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ ఒక విపత్కర పరిస్థితి ఎదుర్కొవాల్సి వస్తుంది. నాయకులు రాగానే వెంట చేరి తిరిగి వెళ్లే వరకు భుజాలు రాసుకుతిరిగే వంది మాగధులు నోరెత్తకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

కార్మికులకు అండగా ఎఐటియుసి



(మొదటిపేజీ తరువాయి)

పోరాటాలు చేసి సాధించుకొన్న 44 కార్మిక సంక్షేమ చట్టాలను కేంద్రంలోని ప్రదానమంత్రి నరేంద్రమోడీ ఏకపక్షంగా రద్దు, యాజమానులకు లాభాలు సమకూర్చి పేట్టే విధమైన నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. జాతి సంపదగా విలసిల్లుతున్న నవరత్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పోరేట్ వర్గాలకు తెగనమ్మే దేశద్రోహ విధానాలను అవలంభిస్తున్న మోడీ సర్కార్‌పై కార్మిక వర్గాలు ఐక్యంగా తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర నిర్మిస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, పెన్షన్ సదుపాయాలు కల్పించటంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందుతున్నాయని ఆరోపించారు. ధరల పెరుగుదల అనుగుణంగా చట్టబద్దమైన కనీస వేతనాలను సమవరించాలని, సంక్షేమ బోర్డులను సమర్థవంతంగా అమలు చేసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు అనుభవిస్తున్న హక్కులు ఎవరూ దానంగా ఇవ్వలేదని మనం పోరాడి సాధించుకున్నవేనని, ఇకముందు కూడా పోరాడి సాధించుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు రాబోయే రోజుల్లో దేశవ్యాప్త సమ్మెలకు కార్మిక లోకం సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులకు అండగా నిలిచేది ఎర్రజెండా అని దాని నీడలో హక్కులను సాధించుకోవాలని కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏఐటియుసి ఆధ్వర్యంలో పోరాటం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, ఏఎంసి డైరెక్టర్ వాడె లక్ష్మి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, ప్రజా సంఘాల నాయకులు శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి సునీల్ కుమార్, వైఎస్ గిరి, వేములపల్లి శ్రీను, కొంగర అప్పారావు, గౌతమి క్రిష్ణ, వల్లపు యాకయ్య, కోరె క్రిష్ణ, పున్నారావు, గోపి, అద్దంకి బాబు, రాము, వెంకట్, బాబు, శెట్టి చేరాలు, జకరయ్య, ఆలపాటి ప్రసాద్, నామా పండు, నవీన్, కాకటి నాగేశ్వరరావు, వెంకన్న, ప్రభావతి, పుష్ప, ముత్తమ్మ, నాగమణి, ప్రేమ్‌చంద్, ప్రశాంత్, వెంకన్న, రమేష్, వజ్జా వాసు, కాటూరి రాము, కొమరయ్య, అల్లి వెంకటేశ్వర్లు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/వైరాः ఎల్‌నినో ప్రభావం నేపద్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ సూచించారు. వైరా మండలం విప్పలమడక గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ మేడా హేమియా చక్రపాణి అధ్యక్షతన ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుఖాన్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా పెసర, మినుము, జొన్న, సజ్జ, కుసుమ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అదేవిధంగా ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో యశ్వంత్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు



ప్రజాపక్షం/ఖమ్మంः ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిజిఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం డిపో కమిటీ ఆధ్వర్యంలో డిపో గేటు ఎదుట జెండా ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ ఏనిమిది గంటల పనివిధానం, పనికి తగిన వేతనం, వారంతపు సెలవులు తదితర హక్కుల పోరాటాల ఫలితంగా సాధించుకున్నవేనని పేర్కొన్నారు. సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిల్లి రమేష్, బేతంపూడి బుచ్చిబాబు, దామాల లాజర్, భాస్కర్, రవీందర్, సునీల్, మూర్తి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి

- మాజీ ఎంపీ నామ



ప్రజాపక్షం/బోనకల్ः ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం బోనకల్‌లో బోనకల్, చింతకాని, ముదిగొండ, మండలాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించేందుకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయిలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసిమద్దతు కోరాలని సూచించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగు రాకేష్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు పాల్గొన్నారు.

ట్యూబ్ పగిలి.. వీల్ విరిగి బోల్తాపడిన వాహనం

-ఆరుగురు కూలీలకు గాయాలు
-ముగ్గురి పరిస్థితి విషమం, ఖమ్మం తరలింపు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కోదాడఖమ్మం జాతీయ రహదారిపై తృటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణిస్తున్న అశోక్ లేలాండ్ వాహనం ట్యూబ్ పగిలి, చక్రం విరిగిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరుగురు కూలీలు గాయపడగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే, మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన సెంట్రింగ్ కూలీలు శనివారం ఖమ్మం నుంచి కోదాడకు అశోక్ లేలాండ్ వాహనంలో ఐరన్ సెంట్రింగ్ సామగ్రితో బయలుదేరారు. కోదాడలో నిర్మాణంలో ఉన్న కోర్టు భవనానికి సామగ్రి తీసుకెళ్తుండగా నేలకొండపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఒక్కసారిగా వాహనం ట్యూబ్ పగిలి, చక్రం విరిగిపోయింది. దీంతో వాహనంలోని సెంట్రింగ్ సామగ్రి ఒకవైపునకు ఒరిగి వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనం పైభాగంలో ఉన్న సురేష్ (38), రాంసింగ్ (40), సురేష్, హనుమంత్ (45), నరేష్ (35) గాయపడగా, క్యాబిన్‌లో ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో వెనుక నుంచి ఇతర వాహనాలు సమీపంగా రావడంతో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న జాతీయ రహదారి అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను విచారించి ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు మరో ఆరు రోజులే గడువు

-అర్హులందరిని నమోదు చేయించాలి
-మాజీ ఎంఎల్ఏ హరిప్రియ నాయక్



ప్రజాపక్షం/ఇల్లందుः ఎంఎల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు గడువు మరో ఆరు రోజులు మాత్రమే ఉన్నందున అర్హులైన వారంతా వెంటనే నమోదు చేసుకోవాలని ఇల్లందు మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్ కోరారు. చివరి రోజుల్లో ఆన్‌లైన్ సర్వర్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి ఉండవద్దని సూచించారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షుడు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకుని ప్రతి గ్రామంలోని పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ఇల్లందు పట్టణంలోని జేకే కాలనీ, ఇల్లందు నియోజకవర్గ క్యాంపు కార్యాలయం నందు ఉచిత నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివరాలకు 9849241052, 9133987345 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించుకోవాలి



ప్రజాపక్షం/వైరాः వైరా మున్సిపాలిటీ 12వ వార్డులోని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ కోరారు. 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన గ్రాడ్యుయేట్లు నవంబర్7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ఎమ్మెల్సీ ఓటు ఉన్నవారు సైతం తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. అవసరమైన పూర్తి వివరాలు అందిస్తే తామే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. 12వ వార్డుతో పాటు వైరాలోని ఇతర ప్రాంతాల గ్రాడ్యుయేట్లు కూడా 8519949266కు సంప్రదించవచ్చని తెలిపారు.

నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలి



-ఆరుతడి పంటలను సాగు చేయాలి
-అవగాహన సదస్సులో అధికారులు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ నీటి వనరులను పొదుపుగా వాడుకుంటూ పంటలను రక్షించుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టపరిశ్రమల శాఖాధికారి ఎంవి మధుసూదన్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో గోగినేని రవికుమార్ ఆయిల్ పామ్ తోటలో ఆయిల్ పామ్, ఉద్యానవన పంటలపై ఎల్‌నినో ప్రభావం నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవి మధుసూదన్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. పంటలకు బిందు సేద్యం (డ్రిప్) పద్ధతిని అమలు చేస్తూ నీటి ఎద్దడిని అధిగమించాలన్నారు. రాబోయే రబీ సీజన్‌లో రైతులు తక్కువ నీటితో సాగు చేసుకోగల కూరగాయల పంటల సాగుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య మాట్లాడుతూ రాబోయే రబీలో నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే ఆరుతడి పంటలు, పప్పు దినుసుల సాగు చేసుకోవాలన్నారు. వర్షపు నీరు వృధాగా పోకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకునేందుకు ప్రతి రైతు తమ పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్త ప్రశాంత్ ఆయిల్ పామ్, ఉద్యానవన పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. డ్రిప్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ తేమ ఆరిపోకుండా కాపాడుకోవాలన్నారు. చీడ, పీడలను తొలి దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్లు మందడపు సుధాకర్, తాతా రఘురాం, సర్పంచ్ తేజావత్ శంకర్, ఉద్యాన అధికారి జి. నగేష్, వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవోలు, హెచ్ఈవోలు, గోడ్రెజ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణ : సిపి



- కేసీఆర్ టవర్స్‌లో తనిఖీలు



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తద్వారా ప్రజల భద్రతకు భరోసా కల్పించవచ్చని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. ఖానాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసీఆర్ టవర్స్ ఆసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని కొందరు గంజాయి విక్రయాలు చేస్తున్నారని ఇటీవల ఫిర్యాదు ఎక్కువగా రావడంతో శనివారం సిపి నేతృత్వంలో సబ్‌డివిజన్ పోలీసులు, సీఏఆర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌బ్రాంచ్, సెంట్రల్‌క్రైం స్టేషన్, ఈగల్‌ఫోర్స్, క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ కు చెందిన మొత్తం 286 మంది పోలీసులు ఏకకాలంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 52 బ్లాక్‌ల్లో అన్నింటిని క్షణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన దృవపత్రాలు లేని 62 ద్విచక్రవాహనాలు, ఐదు ఆటోలు స్వాధీనం చేసుకుని ఖానాపురం స్టేషన్‌కు తరలించారు. 105 మంది నుంచి వేలు ముద్రలు సేకరించి పరిశీలించారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరితో పాటు దానిని సేవిస్తున్న 12 మందిని గుర్తించి వారి నుంచి 50గ్రాముల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివిధ చోరీలలో సంభంధం ఉన్న ముగ్గురుతో పాటు ఇద్దరు అనుమానితులను గుర్తించారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ స్థానికులతో కమ్యూనిటీకనెక్ట్ కార్యాక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. నేరరహిత ప్రాంతాలుగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు పోలీస్ యంత్రంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. స్థానికుల విజ్ఞాప్తి మేరకు పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడువ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కుటుంబం, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయాలకు సంభందించి సమాచారం పోలీసులకు అందించి గంజాయి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వీయరక్షణ కోసం ప్రతి ఇంటి వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాటి ద్వారా ఆసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చని తెలిపారు. నేరస్తుల కదలికలపై నిఘా పెంచామన్నారు. ఎలాంటి వివాదాలు, గోడవలకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. అదేవిధంగా పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచామన్నారు. స్థానికులలో ఎలాంటి అభద్రతా భావం లేకుండా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు కమిషనర్ స్పష్టం చేశారు. ఈతనిఖీలలో సీపీ వెంట అడిషనల్ డిసిపి భోజా రామానుజం, ఏసీపీలు ఎస్‌వివిఎన్ రమణమూర్తి, ఎస్‌బి ఏసీపీ మహేష్, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిందర్, సీసీఎస్ ఏసీపీ సర్వర్, సీఐలు సాదిక్‌పాషా, చిట్టిబాబు, కరుణాకర్, శివప్రసాద్, నాగరాజు, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, వివిధ స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/సత్తుపల్లిః కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సత్తుపల్లి నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జేవీఆర్ ఓసీలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ జెండా ఆవిష్కరించి, కార్మికుల హక్కుల సాధనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.సత్తుపల్లి రింగ్ సెంటర్‌లో బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జెండాను ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిమ్మటూరి రామకృష్ణ ఆవిష్కరించగా, ఆటో కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు. సీపీఐ నాయకుడు దండు ఆదినారాయణ కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ, నిమ్మటూరి రామకృష్ణలు మాట్లాడుతూ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులకు నాలుగు లేబర్ కోడ్లు ముప్పుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని పరిరక్షించాలని, నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసి కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సత్తుపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు కర్నాటి బసవయ్య, తెల్లగారపు రామారావు, సింగరేణి కాలరీ యూనియన్ అసిస్టెంట్ సెక్రటరీ దారా భీమయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్, సత్తుపల్లి జేవీఆర్ఓసి ఫిట్ సెక్రెటరీ నరసింహారావు, ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా సమితి సభ్యులు బుగ్గ సుధాకర్, ఉపేంద్ర చారి, సుబ్రమణ్యం, బిల్డింగ్ అండ్ కనెక్ష్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ రహిమతుల్లా, సత్తార్, వల్లూరు శీను, కంచి శ్రీనివాసరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ కాశీ రావు, జక్కంపూడి వెంకట్, ప్రసాద్ సింగ్, వెంకట్ రామ్ పుల్లయ్య, వినయ్, వెంకటేశ్వరరావు నందిపాటి శీను, రమేష్ పాల్గొన్నారు.

కార్మిక ఐక్యతకు పునాది ఏఐటియుసి



ప్రజాపక్షం/కల్లూరుః కార్మికుల హక్కుల పరిరక్షణ మెరుగైన వేతనాలు పని గంటల నియంత్రణ ఉద్యోగ భద్రత సామాజిక న్యాయం వంటి కార్మికుల ఐక్యతకు పునాది అని అనేక లక్ష్యాలతో ఏఐటీయూసీ ఆవిర్భవించిందని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వేము రాంబాబు అన్నారు. కల్లూరు లోని మునిసిపాలిటీ కార్యాలయం వద్ద ఏఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా శనివారం జరిగింది. కార్మికుల ఉద్యమాలకు వేదికగా ఆవిర్భవించిన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలు రంగాలలో కార్మికులు వేతనాలు పెంపుదల, ప్రమాద బీమా, సాధారణ భీమా, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భీమా అనేక సౌకర్యాలు కల్పనకు ఏఐటీయూసీ పోరాడుతుందని పేర్కొన్నారు. ఐకెపి వివో ఏలు, మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ, మెప్మా, పాఠశాల స్వీపర్లు, ఆర్టీసీ, సింగరేణి తదితర రంగాలలో ఉన్న కార్మికులందరికీ అందరిని ఏకతాటిగా తెచ్చి వారికి అండగా ఉందని వివరించారు. పలు రంగాలలో ఉన్న కార్మికుల కు రక్షణగా ఉంటూ అనేక ఉద్యమాలు చేస్తూ సమస్యల సాధన కోసం ఏఐటియుసి కృషి చేసిందని పేర్కొన్నారు. అనంతరం మిఠాయిలు పంపకం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కత్తిరించి ఆవిర్భావ దినోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపాలిటీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి, కార్యదర్శి వజీర్మియా, కోశాధికారి కంభంపాటి ప్రకాష్, సోషల్ మీడియా జిల్లా నాయకులు మని రాజు, యశోద, అర్జున్, జగదీష్, మధ్యాహ్న భోజనం కార్మికురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి





ప్రజాపక్షం/ అశ్వారావుపేట : వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని సానబోయిన సాంబశివరావు(40) అనే వ్యక్తి శనివారం ఉదయం ఆయన ఇంట్లో జరిగిన శుభకార్యం కార్యక్రమంలో ఏర్పడ్డ చెత్తను ట్రాక్టర్‌పై తీసుకువెళ్లి పక్కన ఉన్న గంధం చెర్వులో వేసేందుకు తన కుమారుడితో పాటు వెళ్తుండగా చెర్వు కట్టపై ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టడంతో సాంబశివ రావు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు చేసిన ఎస్సై సాయికృష్ణారెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దమ్మపేట మండలం రంగువారిగూడెం గ్రామానికి చెందిన చింతల హరీష్(32) అనే వ్యక్తి మద్యానికి బానిసై తన తోబుట్టువు ఇంటికి నారవారిగూడెం వచ్చి పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో వెళ్లడటంతో బంధువులు పేటలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే హరీష్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించటంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణారెడ్డి తెలిపారు.

సీసీ రహదారి నిర్మాణపనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/ముదిగొండ: ముదిగొండ గ్రామంలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా వీబీజీ రాంజీ పథకం నిధుల ద్వారా రూ.11లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు గ్రామ సర్పంచి కట్టకూరి ఉపేందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గ్రామంలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ సీసీ రహదారి చేపడుతున్నారని, నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తొలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రామకృష్ణ, ఉప సర్పంచి చెరుకూరి పార్వతి, వార్డు సభ్యులు మెట్టెల సతీశ్, పటాన్ దస్తగిరి, వీరబాబు, శ్రీకాంత్, వెంకటేశ్, నాగమణి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ప్రజాపక్షం/సత్తుపల్లిః సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలు, రోగులకు అందుతున్న సదుపాయాలు, సిబ్బంది పనితీరును పరిశీలించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.4 లక్షల ఎల్ఓసీ అందజేత



ప్రజాపక్షం/సత్తుపల్లిః తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన మేడి తులసి (4) అనే చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రూ.4 లక్షల విలువైన ఎల్ఓసీని శనివారం అందజేశారు. సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ సహాయాన్ని అందించారు. వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యేకు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రామిక వర్గాల గళం గురుదాస్‌దాస్ గుప్తా



- అసంఘటిత కార్మికులకు దన్నుగా నిలిచిన నేత
- దాస్‌గుప్తా ఆశయ సాధనకు పునరాంకితమవ్వాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం ఃఃః

కేంద్ర ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలి



- ఎస్ఆఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్
- జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రదర్శన

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదైన ఓటు హక్కు పరిరక్షణలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ భారతరాజ్యాంగం ప్రతీ పౌరునికి ఓటుహక్కు కల్పించిందని, అర్హతగల ఓటరు పేరును జాబితా నుండి తొలగించరాదని ఓటరు జాబితా సవరణ పేరుతో పేదలు, కార్మికులు పలస ప్రజలు విద్యార్థులు సామాన్యులు గురయ్యే పరిస్థితి ఎదురవుతోందన్నారు. ఓటర్ జాబితా ప్రక్షాళన పేరుతో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత జవాబుదారీతనం ప్రజలకు తగిన సమాచారం ఉండాలని డిమాండ్ చేశారు. ఓటర్లకు తమ పేర్లను పరిశీలించుకునే అవకాశం అభ్యంతరాలు తెలియజేసే అవకాశం న్యాయమైన అపీళ్ల ప్రక్రియను కల్పించకుండా ఎలాంటి చర్యలు చేపట్టరాదన్నారు. ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర సంస్థగా ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు తలెత్తినప్పుడు వాటికి సరైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా స్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన ఎన్నికల సంఘం ప్రజల ఓటు హక్కుకు ఎలాంటి నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్ నాయకులు పల్లవి మహేశ్వరి కళ్యాణి ఉమా మాన్వితా రోహిణి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు పటేల్ కృషి ఆదర్శం



- ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం
- కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : దేశ ఐక్యత సమగ్రత కోసం నిరంతరం పరితపించిన ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్ చూపిన అంకిత భావం ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. భారత తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వాంత్ర్యానంతరం దేశంలో చెల్లా చెదురుగా ఉన్న అనేక సంస్థానాలను ఒక్కతాటిపైకి అఖండభారత నిర్మాణానికి పటేల్ కృషి చేశారని చెప్పారు. దేశ సమైక్యత పరిరక్షణలో ఆయన ప్రదర్శించిన ధైర్య సాహసాలు దార్శనికత అద్భుతమైనవని పేర్కొన్నారు. జాతి సమగ్రత కోసం జీవితాంతం పనిచేసిన పటేల్ ఆశయాలను స్మరించుకుంటూ వాటిని భావితరాలకు అందించేలా ముందుకు సాగాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ సుజాత కార్పొరేషన్ అధికారులు సిబ్బంది తదితరులున్నారు.

ఐదున ఎస్ఐ, కానిస్టేబుల్ మోడల్ టెస్ట్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ ఐదున జిల్లా స్థాయి ఎస్ఐ, కానిస్టేబుల్ మోడల్ టెస్ట్‌ను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ తెలిపారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిరుద్యోగ సమస్యపై డిసెంబర్ ఏడున ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో నిరుద్యోగ భృతి, నోటిఫికేషన్ల అమలుకై అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. త్వరలో జరగనున్న ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు రాష్ట్రస్థాయి ప్రముఖ మేధావులు, విద్యావేత్తలతో తయారు చేసిన మోడల్ పేపర్‌తో నవంబర్ ఐదున మోడల్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖమ్మంలో వివిధ ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి మోడల్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులంతా ఈ మోడల్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ మోడల్ టెస్ట్ భవిష్యత్తులో రాసే పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. టెస్ట్‌కు సంబంధించిన వివరాలను సెల్ నెం. 9908842328, 9490469559, 9963918170 నెంబర్లను సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రవణ్, యంగ్ ఉమెన్ నాయకులు, కౌన్సిలర్ దండి శ్రీజ, కాంపాటి యమున, బొప్పి ఉమా, జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల కిరణ్, సైదులు, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, లోకేష్ పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాపక్షం/చింతకాని: మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, రైతు సమస్య పరిష్కారం కోరుతూ నవంబర్ 2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా రూ.6 వేలకు పెంపు, రుణమాఫీ, దళితబంధు నిధుల విడుదల, మహిళలకు నెలకు రూ.2500, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల సాధనకు ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థులు



ప్రజాపక్షం/బోనకల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీల్లో మహాత్మాజ్యోతిబా పూలే బోనకల్ గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపిసీ చదువుతున్న ఎం సంతోష్, ఎంపిసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎన్ సుదీప్ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో వీరు ఉమ్మడి ఖమ్మం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థుల విజయంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్‌సిఓ సిహెచ్ రాంబాబు, డిసీఓ, కళాశాల ప్రిన్సిపాల్ సుష్మా, వ్యాయామ ఉపాధ్యాయులు పి వెంకట్రావు, పి వెంకటేశ్వర్లు, అధ్యాపక బృందం అభినందలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి



ప్రజాపక్షం/కూసుమంచి: మండల కేంద్రంలో మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంతో పాటు జిల్లా కమిటీ ప్రధాన కార్యాలయంలో ఎండీ హాఫీజుద్దీన్ నివాసమైన మినీ గాంధీభవన్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండీ హాఫీజుద్దీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బజ్జూరి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, సర్పంచ్ కొండా కృష్ణవేణి మహిపాల్, ఉప సర్పంచ్ చెన్ను వెంకటరమణ తదితరులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో బెల్లంకొండ వెంకన్న, పెండ్ర అంజయ్య, బెల్లంకొండ శరత్‌గౌడ్, పీర్యానాయక్, చాట్ల పరుశురాం, శేఖర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, భూపాల్‌రెడ్డి, చంద్రయ్య, కిరణ్‌గౌడ్, మీరా, కొర్రా రమేష్, రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మాజీ ఎంఎల్ఏ కందాళ



ప్రజాపక్షం/కూసుమంచి: పాలేరు మాజీ ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి తన స్వగ్రామమైన కూసుమంచి మండలం రాజుపేటలో తాను చిన్ననాడు విద్యనభ్యసించిన ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పాఠశాల ఆవరణలో కొంతసేపు గడిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి చదువులు, విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, నాణ్యమైన బోధనపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రోత్సహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని గ్రామస్తులను కోరారు. తాను చదువుకున్న పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆత్మీయంగా గడపడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రాజుపేట గ్రామ సర్పంచ్ బానోత్ మహేష్, ఉప సర్పంచ్ సోలిపురం ప్రభాకర్‌రెడ్డి, కల్లూరుగూడెం సొసైటీ ఛైర్మన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ మోదుగు వీరభద్రం, ఇటూరి శేఖర్, వేముల వీరయ్య, బాలాజీ నాయక్, వెంకన్న పాల్గొన్నారు.

దివ్యాంగ యువతికి అండగా పుష్పాల కుటుంబం

-తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గణప అంజలికి ట్రై సైకిల్ అందజేత



ప్రజాపక్షం/ములకలపల్లి: పోలియోతో దివ్యాంగురాలైన నిరుపేద యువతి గణప అంజలికి ములకలపల్లికి చెందిన పుష్పాల కుటుంబం ట్రై సైకిల్ అందజేసి మానవత్వం చాటుకుంది. మాదారం గ్రామానికి చెందిన అంజలి ఇబ్బందులను తెలుసుకున్న పుష్పాల చందర్‌రావు, తన తల్లిదండ్రులు పుష్పాల జగన్నాథం, ఇందిరమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో ఈ సాయం అందించారు. అపసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడమే దివంగత తల్లిదండ్రులకు ఇచ్చే నిజమైన నివాళి అని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో పుష్పాల వెంకన్న, పుష్పాల చందర్‌రావు, పుష్పాల సాయి, గ్రామ పెద్దలు బండి కొమరయ్య, పువ్వాల మంగపతి, మేకల వెంకన్న, పువ్వాల లలితారావు, ఐతే శేష గిరిరావు, శ్రీరాముల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌ను విస్మరించిన అధికారులు

తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్

ప్రజాపక్షం/ములకలపల్లి: ప్రభుత్వ కార్యక్రమాల్లో గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌కు ప్రాధాన్యత ఇవ్వని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కమలాపురం సర్పంచ్ వగ్గేల రాధ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడు మండలాల జోనల్ క్రీడల బహుమతి ప్రదానోత్సవానికి తనను ఆహ్వానించకుండా నిర్వహించడం ప్రోటోకాల్ ఉల్లంఘన అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్‌ను పిలవకుండా ప్రభుత్వ కార్యక్రమం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అధికారుల ఏకపక్ష వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని విమర్శించారు. ఈకార్యక్రమంలో గోగ్గల ఆదినారాయణ, కుంజా రామూర్తి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన రేగా



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం గ్రామ పంచాయితీలో ఇటీవల మృతి చెందిన బోనం సీతారామిరెడ్డి, బాదం పుల్లమ్మ, బిజ్జం జయరామిరెడ్డి చిత్రపటాలకు పినపాక నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండల మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, స్థానిక సర్పంచ్ బానోత్ సరోజ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ ఆరు తర్వాత కూడా ఓటరు నమోదుకు అవకాశం



-పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యేలా విస్తృత ప్రచారం
-సమీక్షా సమావేశంలో
అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వాసం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నవంబర్ ఆరు తర్వాత కూడా పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరు నమోదుకు అవకాశం ఉందని అదనపు సిఈవో డా।। వాసం వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అదనపు సిఈవో వాసం వెంకటేశ్వర్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు సిఈవో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో మంచి పురోగతి సాధించారని అధికారులను అభినందించారు. నవంబర్ ఆరు చివరి తేదీగా భావించి రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఖమ్మంజిల్లాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఫారం 18 దరఖాస్తుల స్వీకరణతో పాటు వాటి పరిశీలన వేగవంతం చేయాలన్నారు. ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను జిల్లాలో అధికారులు, బిఎల్‌వోలు సమర్థవంతంగా నిర్వహించారని అభినందించారు. అదే స్ఫూర్తితో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై దృష్టిసారించాలన్నారు. నవంబర్ తర్వాత కూడా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఫారం 18 దరఖాస్తుల పరిశీలన అనంతరం పోలింగ్ కేంద్రాల కేటాయింపు కూడా జాగ్రత్తగా ప్రణాళిక రూపొందించి చేపట్టాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో ఖమ్మంజిల్లాలో 83,879 మంది పట్టభద్రులుగా ఓటర్లుగా నమోదయ్యారని ప్రస్తుతం ఇప్పటి వరకు 73,898 దరఖాస్తులు అందాయన్నారు. ఈసారి జిల్లాలో 1.5 లక్షలకు పైగా పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీనివాసరెడ్డి, డి. వేణుగోపాల్, సబ్ కలెక్టర్లు అజయ్ యాదవ్, మృణాల్ శ్రేష్ఠ, ఆర్డిఓలు ఎం. శ్రీనివాస్, మధు, సూపరింటెండెంట్ ఎంఏ రాజు, డిటి అన్సారీ, అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరు జాబితాలో అర్హులైన పట్టభద్రులంతా పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులంతా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2024 ఎన్నికల్లో జిల్లాలో 83,879 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని ప్రస్తుతం ఇప్పటి వరకు 73,898 దరఖాస్తులు అందాయన్నారు. ఈసారి 1.50 లక్షల ఓట్ల నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హులను ప్రోత్సహించి పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి నవంబర్ 26 నాటికి విచారణలు, అభ్యంతరాల పరిశీలన పూర్తి చేసి నవంబర్ 30న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తయిందని 1,74,838 మందికి అర్హత క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. తుది ఎంఎల్సీ జాబితా డిసెంబర్ 30న ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా।। పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డివో శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో భట్టివిక్రమార్క దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/మధిరः సిపిఎం సీనియర్ నాయకులు సామినేని రామారావు హత్యకు సంబంధించి భట్టివిక్రమార్క ప్రోత్బలంతో జిల్లా సిపి సునీల్‌దత్ కొత్త నాటకానికి తెర తీశారని సిపిఐ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు పేర్కొన్నారు. ఇలాంటి సాధారణ వ్యక్తులను అరెస్టు చేయడానికి కేసు పరిశోధించడానికి ఆధారాన్ని సేకరించడానికి మీకు సంవత్సరం కాలం పట్టిందా? అని ప్రశ్నించారు. ఆర్థిక లావాదేవీలు కారణంగా కనిపిస్తున్నాయని ప్రాథమికంగా ప్రకటన చేశారు. హంతకులకు సామినేని రామారావుకి ఉన్న ఆర్థిక లావాదేవీలు ఏంటో ఇప్పటికే బయటపెట్టవచ్చు కదా? ఎమ్మెల్సీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో సామినేని రామారావు హత్య కేసు గుర్తుకు వచ్చిందా? పోలీసుల అసమర్థతను, భట్టి హత్య రాజకీయాలను ప్రజలకు తెలియజేయడం కోసం నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. హత్యకు సంబంధం లేని వ్యక్తులను ముందుకు తీసుకొచ్చి, అసలు నేరస్థులను కాపాడవచ్చు అని ఈ కొత్త నాటకానికి తెర తీశారని అన్నారు. హత్య రాజకీయాలను మధిర నియోజకవర్గ ప్రజలు ఎప్పటికి ఆమోదించారని నిరసన తెలియజేస్తూ మల్లు భట్టివిక్రమార్క దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పడకండి మురళి, మల్లారం మాజీ సర్పంచ్ ఉపేంద్రరావు, ఓట్ల శంకర్ రావు, పుచ్చకాయల కిషోర్, పెంటి వెంకటరావు, పద్రానపు మధు, బాజినేని వెంకటనరసయ్య, కాలసాని కృష్ణ, షేక్ సైదులు, అంగడాల అమరయ్య, షేక్ రహీం, అల్లూరి నాగేశ్వరరావు, శ్రీరాములు, ఇతర నాయకులు పాల్గొన్నారు. దిష్టిబొమ్మ దగ్ధం అవుతుండగానే పోలీసులు దిష్టిబొమ్మను లాక్కొని దగ్ధం చేయకుండా అడ్డుకోవడం నిరసన తెలియజేసి ప్రజాస్వామ్య హక్కును కాళరాయటమే అన్నారు.

భట్టివిక్రమార్క దిష్టిబొమ్మ దహనం సరికాదు



మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి

ప్రజాపక్షం/మధిరः మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ మాట్లాడుతూ సిపిఎం సీనియర్ నాయకులు సామినేని రామారావు మృతి అత్యంత బాధాకరమైన ఘటన అని, వారి కుటుంబానికి న్యాయం జరగాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటికే నిందితులను గుర్తించి పట్టుకున్నారని, చట్టపరమైన ప్రక్రియలో భాగంగా వారిని కోర్టుకు అప్పగించమన్నారని తెలిపారు. పోలీసుల విచారణ, న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో సిపిఎం పార్టీ నాయకులు సంయమనం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు నిందితులను పట్టుకొని చట్టం ముందు నిలబెట్టే ప్రయత్నం చేస్తున్న సమయంలో, విచారణ పూర్తికాకముందే డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కపై ఆరోపణలు చేయడం, ఆయన దిష్టిబొమ్మను దహనం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకవైపు నిందితులను పోలీసులు పట్టుకున్నారని రవి చెబుతూనే, మరోవైపు సిపిఎం పార్టీ పదేపదే రాజకీయ ఆరోపణలు చేయడం బాధ్యతాయుతమైన విధానం కాదన్నారు. సిపిఎం నాయకులు జిల్లా ఎస్పీ సునీల్‌దత్ వంటి పోలీస్ అధికారులపై ఆరోపణలు చేయడం కూడా సరికాదన్నారు. ఈ సమావేశంలో మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాధం, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణగుప్తా, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్‌రెడ్డి, రంగా శ్రీను, కోట దేవిడ్, ఈది అనిల్, లక్ష్మారెడ్డి, బిట్రా ఉద్దండయ్య, ముప్వా వెంకయ్యబాబు, తన్నీరు రామకృష్ణ, చిలివేరు బుచ్చిరామయ్య, జాకీర్ హుస్సేన్, గుండా వీరారెడ్డి, లింగంపల్లి అప్పారావు, గద్దల నాని, దూదేకుల జాని, దోర్నాల రవి, మైలవరపు చక్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల గురుకులంలో ప్రమాదం

-ఇద్దరు విద్యార్థినులకు గాయాలు



ప్రజాపక్షం/బోనకల్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రమాదం చోటుచేసుకుంది. తరగతి గదిలో స్లాబ్ పెచ్చులు ఊడి విద్యార్థినులపై పడటంతో ఇద్దరు బాలికలు గాయపడ్డారు. ఈ ఘటనలో చాపలమడుగు పూజిత(14) తలకు గాయమవ్వగా, అద్దంకి కీర్తన కాలికి గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థినులకు చికిత్స నిమిత్తం బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది పూజితకు తలకు కుట్లు వేసి, ఇద్దరికి చికిత్స అందించినట్లు సమాచారం. విద్యార్థినులు చదువుకుంటున్న తరగతి గదిలోనే స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో తోటి విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. గురుకుల పాఠశాల భవనం పరిస్థితిపై అధికారులు దృష్టి సారించి, మిగిలిన తరగతి గదులను పరిశీలించి విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇంగ్లీష్ లాంగ్వేజ్ టాలెంట్ టెస్ట్



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల పరిధిలోని వేపకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. శనివారం పాఠశాలలో ఆరు నుంచి ఎనిమిదవ తరగతి జూనియర్స్ విభాగంలో, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్‌ను హెచ్ఎం గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు ఎన్. రమాదేవి, అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జక్కంపూడి జగదీష్, సెక్రటరీ రామ్‌నాథ్, ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ఖాతూం, సోమ్లా, జావిద్, కళావతి, వెంకటనర్సమ్మ, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/మధిరः మధిర పట్టణంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపాలిటీ దగ్గర ఉన్న ఏఐటియుసి జెండాను వర్కర్స్ యూనియన్ నాయకులు ఉద్దండు ఆవిష్కరించారు. ఆర్‌వి కాంప్లెక్స్ దగ్గర ఉన్న ఆటో యూనియన్ ఏఐటియుసి దిమ్మ దగ్గర బెజవాడ రవి జెండాను ఎగరవేశారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్ దగ్గర తిమ్మినేని రామారావు ఏఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎంఆర్‌సిఎంవిలు, అబ్బాస్, శివమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సునీల్, రమేష్, రత్నరాజు, మార్తమ్మ, రాధ, ఆటోయూనియన్ నాయకులు గోపి, లాలు, జిల్లా బ్రహ్మం తదితర కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భగా నాయకులు మాట్లాడుతూ ఏఐటియుసి త్యాగాల చరిత్రను కొనియాడారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం



ప్రజాపక్షం/పెనుబల్లిः దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పెనుబల్లి మండలం తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన చేపట్టారు. పాఠశాల విరామ సమయంలో ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) వర్తింపజేయాలని, ప్రభుత్వ ఖజానా నుంచి 010 పద్దు ద్వారానే వేతనాలు చెల్లించాలని, పీజీటీలకు జూనియర్ లెక్చరర్ (జేఎల్) సమాన పే స్కేలును అమలు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే మంజూరు చేయాలని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇతర దీర్ఘకాలిక సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

వైరా 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య శిబిరం ప్రారంభం



ప్రజాపక్షం/వైరాः వైరా మున్సిపాలిటీ పరిధిలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఆరోగ్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బత్తినేని హర్ష, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, మండల అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పొదిల హరినాథ్, కొల్లి రమేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, ఆనందరావు, బీక్యా తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరయ్యారు.

107 ఏళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయుసి



ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు పట్టణ, మండలంలో ఏఐటీయూసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ, బొగ్గుముఠా, గుమాస్తా సంఘం, ఆటోయూనియన్, మ్యాజిక్ యూనియన్, ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జెండాలను ఎగురవేశారు. బొగ్గు ముఠా, గుమాస్తా సంఘం, కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మీనారాయణ జెండా ఎగురవేశారు. ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు జెండా ఎగురవేశారు. ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ ఏ .ఆర్ బాబు జెండా ఎగురవేయగా, ఆటో యూనియన్, మ్యాజిక్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీరచారి జెండా ఎగురవేశారు. ఈ ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మీనారాయణ, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, గడ్డం వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న అనేక హక్కులను నేడు కేంద్రం లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ 44 చట్టాలను నాలుగు బార్ కోడ్ లుగా విభజించి, కార్మిక హక్కులను కాల రాయాలని చూస్తుందని, దీని కోసం కార్మికులు ఏఐటీయూసీ పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు సోండే కుటుంబరావు, పట్టణ, మండల సహాయ కార్యదర్శి లు తోట రమేష్, వేర్పుల నరేష్, నాయకులు ఎస్కే సర్వర్, వార్డు మెంబర్ వజ్జ వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు , మంగి వీరయ్య, అదెర్ల రాములు,భీమరాజు కృష్ణ, మహిళా సమైక్య మండల అధ్యక్ష కార్యదర్శులు కోడిమెల సుజాత, బోలగాని సమ్మక్క, రంజిత్, ఆటో, మ్యాజిక్ యూనియన్ చారి, సిరిగద్దే సతీష్,మల్లేష్, ఎంఏ. రాజు, శంకర్, బిక్షం, ఆర్టీసీ నాయకులు పూర్ణచందర్, సందీప్,యాదవ్, ఓంకార, బొగ్గుముఠా సంఘం నాయకులు శ్రీకాకుళం వీరమల్లు, లింగస్వామి, కనతాల కోటయ్య, గుమాస్తా సంఘం భీమరాజు కృష్ణ, ప్రభాకరరెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఐటీయూసీ పుట్టినరోజు సందర్భంగా తారా ప్రసాద్ అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

-ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి ఘన సన్మానం



ప్రజాపక్షం/మణుగూరుః నూతన పాలకరవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బూర్గంపాడు మార్కెట్ కమిటీకి నూతనంగా ఎన్నికైన వైస్ చైర్మన్ కాకా రాములు, డైరెక్టర్లు పాల్వంచ శ్రీను, ఏనిక మంగమ్మ, లోడిగా సత్యనారాయణ లను శనివారం మణుగూరు మండలం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక శాసనసభ్యులు, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అందించాల్సిన సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మార్కెట్ కమిటీ ఫలాలు ప్రతీ ఒక్క రైతుకు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం సన్మానం పొందిన ప్రతినిధులు ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, మార్కెట్ కమిటీ అభివృద్ధికి మరియు రైతుల అభ్యున్నతికి తమ వంతు పూర్తి బాధ్యతతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొలమూరు రాజు, మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బానోతు లక్ష్మణ్ నాయక్, సారంపల్లి రామ్ రెడ్డి, ఐఎన్టీయూసి రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాసరెడ్డి లతో పాటు పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో ఏఐటీయూసీ



ప్రజాపక్షం/చుంచుపల్లిః సింగరేణి సంస్థ పరిరక్షణతోపాటు కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో యూనియన్ జెండాలను ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థను కాపాడుకోవడంతోపాటు కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఏఐటీయూసీ అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. సేవ్ సింగరేణి జాతా, హెడ్ ఆఫీస్ ముట్టడి, జెన్‌కో ముట్టడి వంటి కీలక పోరాట కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగా గుర్తింపు సంఘంగా కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా 24 కీలక ఒప్పందాలు కుదిరాయని వెల్లడించారు. కుదిరిన ఒప్పందాలను క్షేత్రస్థాయిలో అమలు చేయించి కార్మికులకు పూర్తి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, ఆఫీస్ బేరర్స్ ఎస్.నాగేశ్వరరావు, హుమాయూన్, హీరాలాల్, గుమ్మడి వీరయ్య, పిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, మధు కృష్ణ, కమల్, మెంగన్ రవి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పోరాటంలో ఏఐటీయూసీది చారిత్రక పాత్ర



ప్రజాపక్షం/ఇల్లందు: బ్రిటిష్ పాలనకు, తెలంగాణలో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులను సంఘటితం చేసి ఏఐటీయూసీ పోరాటాలు చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ అన్నారు. ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విఠల్‌రావు భవన్‌లో కె సారయ్య జెండా ఆవిష్కరించారు. 1920 అక్టోబర్ 31న ఏర్పడిన ఏఐటీయూసీ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందన్నారు. అనంతరం కార్మిక ఉద్యమనేత, మాజీ ఎంపీ గురుదాస్ గుప్తా ఏడో వర్ధంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి కె సారయ్య, బాస శ్రీనివాస్, బైరవేని సదానందం, దాసరి రాజారామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మికుల హక్కుల కోసం పార్లమెంటులో పోరాడిన గుప్తా ఆశయాలను కొనసాగించాలని నాయకులు కోరారు. ఈకార్యక్రమంలో దాసరి రాజారామ్, కొరిమి సుందర్, బైరవేని సదానందం, గుగులోత్ కృష్ణ, జంగంపల్లి మేజేస్, దాట్ల వెంకటేశ్వర్లు, నూనె శ్రీనివాస్, జాన్ మైఖేల్, పెండల కుమార్, పుట్ట సతీష్, ఆలేం రాఘవేంద్రరావు, మంచాల వెంకటేశ్వర్లు, బంటు యాదగిరి, భాస్కర్, టి వెంకటేశ్వరరావు, ఎస్‌డీ రబ్బానీ, మురహరి, పాపారావు, సాధనాల శ్రీనివాస్, ఎస్ రవి, లాలయ్య, షేక్ వలి, వల్లాల రాజమొగిలి, ఏఐవైఫ్ నాయకులు రామకృష్ణ, శరత్, తదితరులు పాల్గొన్నారు.

పీవీకే-5 గనిలో వైభవంగా దేవి శరన్నవరాత్రి వేడుకలు

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/చుంచుపల్లిః పీవీకే5 గనిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించడంతోపాటు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ముందుగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధిగా, కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులుగా కార్మికులతో కలిసిమెలిసి గడపడంతో అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. అనంతరం గని మేనేజర్, ఏజెంట్ కలిసి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్, యూనియన్ నాయకులు, గని అధికారులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/జూలూరుపాడుః కార్మిక హక్కులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ పాపకొల్లు అడ్డా వద్ద ఏఐటీయూసీ సీనియర్ నాయకులు నిమ్మటూరి లచ్చయ్య ఏఐటీయూసీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న కార్మికుల హక్కులు, గౌరవప్రదమైన జీవనం, సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో ఆవిర్భవించిన ఏఐటీయూసీ నేడు 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గార్లపాటి శివకృష్ణ, సిరిపురపు వెంకటేశ్వర్లు, గుడిమెట్ల సీతయ్య, వల మల్ల సామేలు, ఎస్కె చాంద్ పాషా, కత్తి గోపి, భోగిళ్ళ రమేష్, మల్కం వీరభద్రం, మధు, లక్ష్మణ్, నరసింహారావు, పవన్ వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/మణుగూరుః కార్మికుల హక్కుల సాధన, శ్రమజీవుల సంక్షేమం, కార్మిక వర్గ అభ్యున్నతి లక్ష్యంగా 107 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీ అని సీపీఐ పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్ అన్నారు. పినపాక మండల పరిధిలోని ఏడుళ్ల బయ్యారం ప్రధాన సెంటర్‌లోని హమాలీ సంఘం కార్యాలయం వద్ద ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్, సీపీఐ సహాయ కార్యదర్శి కప్ప వెంకటేశ్వర్లు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఎన్నో సంవత్సరాలుగా నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్షుడు భక్తుల అన్వీరెడ్డి, కుర్రి నర్సయ్య, కాసు, గణేష్, వెంకన్న, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టి, సకాలంలో బిల్లులు పొందాలని ఎంపీడీవో ఎం.యర్రయ్య సూచించారు. శనివారం మండలంలోని మంగాపురం తండాలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లతో పాటు గ్రామ సమాఖ్య భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా యర్రయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తోందని, లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామ సమాఖ్య భవనాలు మహిళల అభ్యున్నతికి, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు ఈ భవనాలు వేదికలుగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీవో ఎం.శ్రీనివాస రావు, సర్పంచ్ ధీరావత్ అశోకరాణి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, పీఆర్ ఏఈ ప్రసాద్, గ్రామ పెద్దలు గోబ్రియా తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న సిసి రోడ్డు పరిశీలన



ప్రజాపక్షం/వైరాः వైరా మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్ర కళ మురళీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్దేశిత ప్రమాణాల మేరకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ బత్తుల సుమతి, ఏఈ శ్రీమణ్య, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఏడుకొండలు, గోరంట్ల పిచ్చారావు, తిరుపతి దాను తదితరులు పాల్గొన్నారు.

కార్మికోద్యమ దిక్సూచి ఏఐటీయుసి



-ఘనంగా ఏఐటీయుసి ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కార్మికోద్యమ చరిత్రలో అనేక చారిత్రక పోరాటాలకు నేతృత్వం వహించిన ఏఐటీయుసి దేశ కార్మికోద్యమ దిక్సూచి అని ఏఐటీయుసి జాతీయ సమితి సభ్యులు శింగు నర్సింహా రావు తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర అనంతరం అనేక పోరాటాలను సాగించి పోరాట విజయాలను అందుకున్న చరిత్ర ఏఐటీయుసి సొంతమన్నారు. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయుసి) 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఖమ్మం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయుసి నూరేళ్ల పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన జెండాను శింగు నర్సింహారావు ఆవిష్కరించగా 49వ డివిజన్‌లో జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, ఆటో కార్మికుల అడ్డాపైన పగడాల మల్లేష్, ఇండస్ట్రియల్ ఏరియాలో ఏనుగు గాంధీ ఏఐటీయుసి పతాకా లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన పైలాన్ వద్ద జరిగిన సభలో శింగు నర్సింహారావు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయుసి మాత్రమేనన్నారు. 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఏఐటీయుసి 106 సంవత్సరాల పోరాట చరిత్రను కొనసాగిస్తూ 107వ సంవత్సరంలో అడుగిడిందన్నారు. ఏఐటీయుసి అంటేనే పోరాటమని ఆ పోరాటంతోనే కోట్ల మంది కార్మిక సమస్యలను పరిష్కరించిన వేది కగా మారిందని నర్సింహారావు తెలిపారు. భారతదేశ కార్మిక వర్గం ఇప్పుడు సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటుందని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్ పేరుతో హక్కులను హరించడంతో పాటు శ్రమ దోపిడీని విస్తృత పర్చిందని ఆయన తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులను ఐక్యం చేసి కార్మిక హక్కుల పరిరక్షణ కోసం మరో చారిత్రిక పోరాటానికి భారతదేశ కార్మికులు సిద్ధం కావా లని నర్సింహారావు పిలుపునిచ్చారు. ఏఐటీయుసి అగ్రనేత, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి గురుదాస్ దాస్ గుప్తా వర్ధంతి సందర్భంగా ఏఐటీయుసి నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు గాదె లక్ష్మి నారాయణ, సిహెచ్ సీతామహాలక్ష్మి, పేరబోయిన మోహన్‌రావు, పిట్టల మల్లయ్య, నకిరికంటి కృష్ణ, ముత్తయ్య, బాబురావు, మహేష్, గుగులోత్ శోభన్‌బాబు, రాంబాబు, సోమయ్య, చందు, ఉపేందర్, వెంకన్న, సాంబ, మంగీలాల్, రాందాస్ పాల్గొన్నారు.

శ్రామిక వర్గ పోరాటాలకు ఏఐటీయుసి జెండానే దిక్సూచి



- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా
- ఏఐటీయూసి ఆధ్వర్యంలో ఘనంగా 106వ ఆవిర్భావ వేడుక

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం ఃశ్రామిక వర్గ పోరాటాలకు ఏఐటీ యూసి జెండానే దిక్సూచి అని శ్రామిక పక్షాన నిలబడి ఎరుపెక్కించిన ఆ ఎర్రజెండా నీడలోనే కార్మికులకు అసలైన రక్షణ లభిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శనివారం పట్టణంలోని పలు కార్మిక కేంద్రాలు, హమాలీ అడ్డాల్లో ఏఐటీయూసి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించు కుని సంఘ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఒక శతాబ్దానికి పైగా దేశ ఆర్థిక రంగాన్ని ముందుకు నడిపిస్తున్న శ్రామికుల సంక్షేమాన్ని కేంద్ర పాల కులు పూర్తిగా గాలికొదిలేసారని విమర్శించారు. ఎన్నో త్యాగాలు ఆందో ళనలు సమ్మెలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్‌లు తీసుకురావడం అంటే కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడమే అని దుయ్యబట్టారు. సంఘటిత అసంఘటిత రంగాలు అనే తేడా లేకుండా కోట్లాది మంది హమాలీలు, ఆటో కార్మికులు ఇతర శ్రామి కుల జీవితాలను పాలకుల విధానాలు తీవ్ర సంక్షోభంలోనికి నెట్టి వేశా యని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు శక్తులకు కారుచౌకగా కట్టబెట్టే కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత శ్రామిక లోకంపై ఉందన్నారు. కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు ఏఐటీ యూసి ఎల్లప్పుడూ అండగా ఉండి రాజీలేని ఉద్యమాలను నడుపుతుం దని స్పష్టం చేశారు. కార్మికవర్గ ఐక్యతను చాటిచెబుతూ రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్ గెద్దాడు నగేష్ వంగ వెంకట్ గనగళ్ల వీరస్వామి రమణమూర్తి వాసిరెడ్డి మురళీ భూక్యా శ్రీని వాస్ మండల రాజేశ్వరరావు లక్ష్మీ నారాయణ మాతంగి లింగయ్య అరెల్లి కృష్ణ అబ్బులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామారావు హత్య కేసులో

అసలైన హంతకులను అరెస్టు చేయాలి



-అఖిలపక్ష సమావేశంలో వివిధ పక్షాల నేతలు

ప్రజాపక్షం/ ఖమ్మం : సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామా రావు హత్య కేసులో అసలైన హంతకులను అరెస్టు చేయాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం కార్యాల యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సామినేని రామారావు హత్య జరిగిన నాటి నుంచి పోలీసులు పక్షపాతంతో వ్యవ హరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అసలైన హంతకులను పట్టుకోవ డంలో విఫలమై కేసును తాత్సరం చేస్తూ ఇప్పుడు నిందితులను రక్షించే క్రమంలో అమాయకులను అరెస్టు చేశారని సుదర్శన్ ఆరోపించారు. నలుగురికి హత్యతో సంబంధం ఉన్నట్లు కట్టు కథలు చెబుతున్నారని ఇది పూర్తిగా అబద్ధమన్నారు. సామినేని హత్య కేసుకు సంబంధించి సిట్ ఏర్పాటు చేయాలని ఇందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని భట్టి విక్ర మార్క అడ్డు పడటం వల్లే సిట్ ఏర్పాటు కాలేదని సుదర్శన్ తెలిపారు. రామారావుకు ఏవిధమైన ఆర్థిక ఆస్తుల వివాదాలు లేవని ఆయన కాంగ్రెస్ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. సిపిఐ నాయ కులు శింగు నర్సింహారావు మాట్లాడుతూ సామినేని రామారావు హత్య కేసులో పలు అనుమానాలు వ్యక్తమవుతున్న దృష్ట్యా సిట్ ఏర్పాటు చేయాలని అసలు దోషులెవరో తేల్చాలన్నారు.ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా వివిధ పార్టీల నాయకులు లక్ష్మి నారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, విక్రం, భారతి, రాంబాబు, రామారావు కుమారుడు విజయ్ పాల్గొన్నారు.

దిష్టి బొమ్మ దగ్ధం :
సామినేని రామారావు హత్య కేసులో అసలు నిందితులను ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క కాపాడుతున్నారంటూ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దిష్టిబొ మ్మను దగ్ధం చేశారు. భట్టివిక్రమార్క తన స్వప్రయోజనాల కోసం సిపి ఎంను దెబ్బతీసేందుకు సిపిఎం నాయకున్ని హత్య చేశారని సిపిఎం జి ల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి వై. విక్రం, నాయకులు పొన్నం వెంకటేశ్వర రావు, మాదినేని రమేష్, మడుపల్లి గోపాలరావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కరువు కోరల్లోకి నెట్టిన కాంగ్రెస్

-కాళేశ్వరాన్ని నిర్లక్ష్యం చేయడమే కరువుకు కారణం
-మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు



ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ కరువు కోరల్లోకి నెట్టిందని కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేసిన ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కేసిఆర్ పాలనలో సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్ ఆగమాగం చేసిందన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ పై ఆరోపణలు మాని పాలనపై దృష్టిసారించాలన్నారు. ఎంఎల్సీ ఎన్నికల ఓట్ల చేర్పింపుకు సంబంధించి బిఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేస్తుందని ఇప్పటికే ఖమ్మం జిల్లాలో లక్ష మంది విద్యావంతులను ఓటర్లుగా నమోదు చేశామన్నారు. యువతకు, ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ చేసిన అన్యాయాన్ని మననం చేసుకుని సరైన రీతిలో ఓటు హక్కును వినియోగించుకోవాలని బిఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో తప్పుదారి పట్టించే రాజకీయాలు చేయడం తప్ప కాంగ్రెస్ చేసింది ఏమి లేదన్నారు. మూడేళ్ల నుంచి సమస్యలను పరిష్కరించకుండా కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆరోపించారు. మాట్లాడితే ఢిల్లీ వెళ్తున్నారని ఢిల్లీ నుంచే కాంగ్రెస్ పాలన సాగిస్తే మంచిదని హితవు పలికారు. సాగునీటికి సంబంధించి కేసిఆర్ చేపట్టిన ప్రాజెక్టుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం వల్లే రాష్ట్రానికి ఈ పరిస్థితి దాపురించిందన్నారు. సిపిఎం నాయకుడు సామినేని రామారావు హత్యకు సంబంధించి సిట్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఎంఎల్సీ తక్కెళ్లపల్లి రవీంద్రరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్సీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, నాయకులు ఏనుగు రాకేష్‌రెడ్డి తదితరులు మాట్లాడగా బిఆర్ఎస్ నాయకులు ఆర్జెసి కృష్ణ, సైదిరెడ్డి, బలుసు మురళీకృష్ణ, పగడాల నరేందర్, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి వార్డెన్ నిర్లక్ష్యమే కారణం

-వార్డెన్, అధికారిని సస్పెండ్ చేయాలి
-వామపక్ష విద్యార్థి సంఘాలు



ప్రజాపక్షం/ఖమ్మం : గాంధీ చౌక్ బిసీ సంక్షేమ వసతి గృహంలో ఇంటర్ విద్యార్థి అజయ్ మృతికి బాధ్యులైన వార్డెన్, అధికారిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యూ తదితర వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి మృతిని నిరసిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ రెండు రోజులుగా అనారోగ్యంతో ఉన్న విద్యార్థికి సకాలంలో వైద్యం అందించడంలో హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. సంక్షేమ వసతి గృహాల్లో ప్రతి నెలా వైద్య శిబిరాలు నిర్వహించాలని, సైకాలజిస్టులను నియమించాలని, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని కోరారు. జిల్లా ఉన్నతాధికా రులు హాస్టళ్లను తక్షణమే తనిఖీ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి లక్ష్మణ్, బూర మనోజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యూ నాయకులు మస్తాన్, లక్ష్మణ్, ఐసా జిల్లా నాయకుడు జమ్మి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యాలయంలో ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా మండల గౌరవ అధ్య క్షుడు రామచందర్‌రావు ఏఐటీయూసీ పోరాట చరిత్రను వివరించగా, మండల అధ్యక్షుడు రాయపూడి రాజేష్ కార్మిక చట్టాలు, హక్కులు, ప్రయోజనాలపై మాట్లాడారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ కార్మిక హక్కులకు భంగం కలిగించే విధానాలను ప్రశ్నిస్తూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఈయనపల్లి పవన్ సాయి, ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండల వ్యాప్తంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాలను శని వారం ఘనంగా నిర్వహించారు. రాయగూడెంలో ఇంది రా గాంధీ విగ్రహానికి గ్రామ సర్పంచ్ బోయిన వేణు పూ లమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశా నికి ఇందిరా గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లోనూ ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, బోయిన నరసింహారావు, ఇరగదిండ్ల నాగరాజు, బ్రహ్మయ్య, గణేష్, రాజాబాబు, రాములు, రాంబాబు, కోసూరి వెంకటేశ్వర్లు, పానకాలు పాల్గొన్నారు.

ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి



ప్రజాపక్షం/జూలూరుపాడుఃగ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు వీబిజి రాంజీ పనులకు హాజరై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీసీఈఓ నాగలక్ష్మి తెలిపారు. శనివారం జూలూరుపాడు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రెండవ రోజు వీబిజీ రాంజీ మేట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, ఏపీఓ రామారావు తదితరులు పాల్గొ